
సాక్షి
బాపట్ల
బుధవారం, 8, మే, 2024



భక్తిశ్రద్ధలతో అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి బండ్లమ్మ ఆలయంలో అమావాస్య సందర్భంగా మంగళవారం హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గుంటి ఆంజనేయస్వామికి పూజలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక గుంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి హనుమాన్ దీక్ష స్వాములు 11వేల నిమ్మకాయలతో ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహించారు. దీక్ష స్వాములకు సద్ది వితరణ జరిగింది.

న్యూస్‌రీల్

వర్షంలోనూ అంబటి ప్రచారం



నకరికల్లు: ఎన్నటికీ తరగని ప్రజాదరణ వైఎస్సార్ సీపీ సొంతమని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వర్షం కురుస్తున్నా ప్రచారం సాగించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి గుమ్మడికాయతో దిష్టి తీసి ఘనస్వాగతం పలికారు. చిన్నారులు మంత్రి అంబటితో ఫొటోలు దిగుతూ కోలాహలం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొడ్లపాటి కృష్ణకుమారిభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొడ్లపాటి వెంకటరెడ్డి, ఏపీ డీసీ డైరెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటన దృష్ట్యా నేడు ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజయవాడలో రోడ్ షో ఈనెల 8న సందర్భంగా గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే వాహనాలు బుడంపాడు అండర్ పాస్ నుంచి నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరు, చందోలు చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం మీదుగా హనుమాన్ జంక్షన్ దగ్గర్లోని జాతీయ రహదారి -16 వైపు వెళ్లాలని తెలిపారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు చుట్టుగుంట నుంచి పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలని సూచించారు.

యార్డుకు 70,843 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 70,843 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 776 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 20,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 55,550 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

మహంకాళీ దేవస్థానానికి రూ.లక్ష విరాళం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాత మంగళవారం రూ.1,01,116లు విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మాట్లాడుతూ చేబ్రోలు వాస్తవ్యులు చిన్నంశెట్టి పోతురాజు, పార్వతి దంపతులు ఆలయ అభివృద్ధి నిమిత్తం ఈ విరాళాన్ని అందజేశారని వెల్లడించారు. అనంతరం దాతలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వ్యయ వివరాలు తెలపండి

గుంటూరు వెస్ట్: రానున్న ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వ్యయాలకు సంబంధించిన వివరాలను ఎన్నికల పరిశీలకులకు తెలపాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మంగళవారం తెలిపారు. గుంటూరు పార్లమెంట్‌కు మృణాల్ కుమార్ దాస్ (సెల్ 91548 82126) తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాలకు రాధానాథ్ పురోహిత్ (91548 82131), ప్రత్తిపాడు, గుంటూరు వెస్ట్, ఈస్ట్‌లకు యెర్నె వినోద్‌కుమార్ (91548 82129)లు అందుబాటులో ఉంటారన్నారు. వివరాలను సెల్‌ఫోన్ ద్వారాగాని, లేదా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు వచ్చి నేరుగా అందజేయవచ్చని ఆయన తెలిపారు.

ప్రచార పర్వం



వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్ మంగళవారం చిన్నబజార్, ఆణుమల్లిపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. - వేటపాలెం



అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి మంగళవారం సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం, పాతమాగులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు అనే ఆయుధంతో కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. - అద్దంకి



చుండూరు మండలంలోని చినపరిమి, ఆలపాడు, అంబేద్కర్ నగర్, చుండూరు, మున్నంగివారిపాలెం, వేటపాలెం గ్రామాల్లో మంగళవారం వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం చేశారు. -వేమూరు

వేమూరులో ఫ్యాన్ ఫుల్ స్పీడ్

- గెలుపుబాటలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు
- సీఎం వైఎస్.జగన్ ఐదేళ్ల పాలనపై ప్రజల నుంచి సానుకూలత
- సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి
- సామాజిక సమీకరణలకు పెద్దపీట
- టీడీపీ అభ్యర్థికి ప్రజల నుంచి వ్యతిరేకత
- ఆంధ్రా లూథరన్ ఆస్తులు కొల్లగొట్టాడన్న ఆరోపణలు
- కేడర్‌ను పట్టించుకోని వైనం
- తిరిగి వైఎస్.జగన్ పాలన కోరుకుంటున్న ప్రజలు



వేమూరు నియోజకవర్గం మ్యాప్



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సమర్థపాలనతో పాటు పేదల ఆర్థికాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు.. సమన్యాయం కోసం సామాజిక సమీకరణలకు పెద్ద పీట.. బలహీనవర్గాలకు పదవులు, పాలనలోనూ ప్రాధాన్యత.. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన తీరు ఇది. ఆయన జనరంజక పాలనలో అర్హులైన అన్ని వర్గాల వారు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నతస్థాయికి చేరారు. ముఖ్యంగా మహిళలకు ఆర్థిక స్వావలంబన లభించింది. అటు సమాజంలోనూ గౌరవస్థానం పొందారు. దీంతో ప్రజలంతా ఈ ఎన్నికల్లో సామూహికంగా ఓట్లేసి తిరిగి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనను తెచ్చుకునేందుకు సన్నద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలోనూ పరిస్థితులు దీనికి అద్దంపడుతున్నాయన్నది పరిశీలకుల మాట.

అక్రమాలే టీడీపీ అభ్యర్థి ప్రతికూలతలు

టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబు అక్రమాలు ఆయనకు ప్రతికూలతగా మారిందన్నది పరిశీలకుల అంచనా. గుంటూరులో విలువైన ఆంధ్ర లూథరన్ ఆస్తుల్ని 99 సంవత్సరాల లీజు పేరుతో కొట్టేసి కోట్లాది రూపాయల్ని ఆర్జిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గుంటూరు నాజ్ సెంటర్‌లో గుంట గ్రౌండ్‌కు చెందిన 25 ఎకరాల స్థలాన్ని లీజుపేరుతో కొట్టేసి ఎగ్జిబిషన్లు, కూటమి మీటింగులు, సభలు, సమావేశాలకు ఇచ్చి కోట్లు గడిస్తున్నారు. ఇక్కడే కుగ్లర్ ఆసుపత్రికి చెందిన 7.50 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకొని నర్సింగ్ కాలేజీ నడుపుతున్నారు. కొంత స్థలంలో ఏకంగా అపార్ట్‌మెంట్ లేపారు. గుంటూరు అరండల్ పేటవద్ద ఉన్న స్థలాన్ని లీజుకు దక్కించుకొని నాగార్జున గ్రాండ్ పేరుతో హోటల్ నిర్మించి నడుపుతూ పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నారు. దీంతో ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. పైగా ఆయన గుంటూరులో ఉంటూ వేమూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. నాయకులు, కార్యకర్తల్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో పలు మండలాలకు చెందిన పలువురు నేతలు ఆనందబాబు వ్యవహార శైలి నచ్చక అసంతృప్తితో ఉన్నారు. వీరిలో చాలామంది ఈ ఎన్నికల్లో ఆయనకు వ్యతిరేకంగా పనిచేయనున్నట్లు తెలుస్తోంది. ఐదేళ్ల పాలనలో లబ్ధి పొందిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఓట్లేసి తిరిగి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అశోక్‌బాబును వేమూరు శాసనసభ్యుడిగా గెలిపించనున్నారన్నది పరిశీలకులు అంచనా.

వరికూటి విజయం ఖాయం

వేమూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబు టీడీపీ అభ్యర్థిగా నక్కా ఆనందబాబు పోటీ చేస్తున్నారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గమైన వేమూరులో గత ఎన్నికల్లో అధికార పార్టీ విజయం సాధించింది. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు పేదలు సంక్షేమ పథకాల ద్వారా పెద్దఎత్తున లబ్ధి పొందారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగారు. అందరికీ సమ అవకాశాలు దక్కాయి. ఇవన్నీ అధికార పార్టీ అభ్యర్థి విజయానికి దోహదపడనున్నాయని అంచనా.

వరికూటి అనుకూలతలు

వేమూరుకు కొత్త అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబును అధికారపార్టీ ఎంపికచేయడం కలిసి వచ్చిన అంశం. హుషారుతనం, కలుపుగోలుగా ఉండటం, నాయకులు, కార్యకర్తలను కలుపుకొని వెళ్లడం, మార్నింగ్ కాఫీ కార్యక్రమంతో ఉదయాన్నే జనంలోకి వెళ్లడం, కార్యకర్తలతో పాటు ఓటర్లను ఆప్యాయంగా పలకరించడం ఆయనకు తక్కువ సమయంలోనే మంచిపేరు తెచ్చింది. అవసరాన్ని గుర్తించి పేదల్ని ఆర్థికంగా ఆదుకుంటున్నారు. నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, కొల్లూరు మండలాల పరిధిలో దెబ్బతిన్న రోడ్లను సొంత డబ్బులు వెచ్చించి మరమ్మతులు చేయించడంతో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు వరికూటిని ప్రశంసిస్తున్నారు. ఇక్కడ సుమారు 80 వేల పైచిలుకు ఉన్న ఎస్సీ సామాజికవర్గం ఓటర్లలో అత్యధిక శాతం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా నిలవనున్నారు. వీరితో పాటు రెడ్డి, ముస్లిం, బీసీ వర్గాల ఓటర్లు సైతం అధికార పార్టీకి అండగా నిలువడం ఈ ఎన్నికల్లో వరికూటి అశోక్‌బాబుకు మరింతగా కలిసిరానుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం



పేటేరులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా

రేపల్లె రూరల్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్ని ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాబద్ధంగా, సమర్థంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. రేపల్లె పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం పంపిణీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికల నిర్వహణ సరళిపై సంబంధిత అధికారులు, పీవోలు, ఏపీవోలకు దిశా నిర్దేశంతో పాటు శిక్షణ తరగతులు నిర్వహించామని చెప్పారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. గత ఎన్నికల అనుభవాల్ని దృష్టిలో ఉంచుకుని అల్లర్లు జరిగిన గ్రామాలు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్ని గుర్తించి ఎన్నికల కమిషన్‌కు నివేదించామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక పోలీసు బలగాల పహారాతో పాటు ఓటింగ్ సరళిని లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు బుధవారం వరకు అవకాశం కల్పించామని తెలిపారు. అనంతరం ఆర్వో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని, మండలంలోని పేటేరులోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఆయన వెంట రేపల్లె ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ తదితరులున్నారు.

పేదల పక్షపాతి జగనన్న గెలుపు తథ్యం

పేటేరు గ్రామ ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్



నాయకులతో కలసి పేటేరులో పర్యటిస్తున్న నందిగం సురేష్

రేపల్లె రూరల్: పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్ పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పేటేరులో మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ ప్రచారం నిర్వహించినా తరలివస్తున్న అశేష జనవాహినిని చూస్తుంటే 2024 ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రిగా జగనన్నను చూడటం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తు చేశారు. నవరత్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ప్రజల్ని మరోమారు మోసగించేందుకు అమలు చేయలేని హామీలతో కూటమితో వస్తున్న చంద్రబాబును, ఆయన భజన బృందాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. గత ఐదేళ్లలో నవరత్న పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధి వివరాలతో పాటు జగనన్న ప్రకటించిన మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ కుమారుడు సృజన్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ 'బాబు కమిషన్'గా మారిపోయింది

ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కమిషన్ బాబు కమిషన్‌గా మారిపోయిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి విమర్శించారు. స్థానిక కోన చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు నిబంధనలు మారుస్తోందని తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న పథకాల్ని మన రాష్ట్రంలో మాత్రం నిలుపుదల చేయడంలో అర్థం లేదని పేర్కొన్నారు. ఆసరా పథకం నాలుగో విడత విడుదల చేసి 74శాతం పంపిణీ చేయగా మిగిలిన 26 శాతం నిలుపుదల చేయడం దుర్మార్గమైన విషయమని ఖండించారు. ఫీజురీయింబర్స్‌మెంట్‌ను కూడా నిలుపుదల చేయడం వల్ల విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొన్నిచోట్ల విద్యార్థులు పరీక్షలకు కూడా వెళ్లకుండా కళాశాలలు అడ్డుకుంటున్నాయని కోన రఘుపతి వెల్లడించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా నిలుపుదల చేయించారని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని తెలియజేశారు. ఫించన్ల పంపిణీలోనూ తెలుగుదేశం పార్టీ అనుసరించిన వైఖరితో ఎంతో మంది అవ్వాతాతయ్యలు ఇబ్బందులు పడ్డారని కోన గుర్తు చేశారు. ఎండలో వృద్ధుల్ని కష్టపెట్టిన పాపం చంద్రబాబు టీంకు తగులుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ప్రభుత్వం కొనసాగిస్తున్న పథకాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కోన రఘుపతి కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, కృష్ణ గుప్తా పాల్గొన్నారు.

కూటమి కుతంత్రంతో సంక్షేమ పథకాలు రద్దు

వైఎస్సార్ సీపీ నాయకులు రావెల కిశోర్‌బాబు



కూచిపూడిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న కిశోర్‌బాబు

కూచిపూడి(వేమూరు) : పేదలకు వైఎస్సార్ సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాల్ని తెలుగుదేశం పార్టీ కూటమి కుతంత్రాలతో రద్దు చేయిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు రావెల కిశోర్‌బాబు ధ్వజమెత్తారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ కూటమికి ఓట్లు వేస్తే పథకాల్ని రద్దు చేస్తుందని ప్రజల్ని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి చేస్తున్న ప్రయత్నాలు, మాయ మాటల్ని నమ్మవద్దని ఆయన సూచించారు. నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అంతా అభూత కల్పనని కొట్టిపారేశారు. గత ఎన్నికల్లోనూ అమలు చేయని మేనిఫెస్టోతో మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు యుద్ధం లాంటివని పేర్కొన్నారు. పెత్తందారుల, పేదల మధ్య జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని అశోక్‌బాబు స్పష్టం చేశారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్, వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబును గెలిపించాలని అశోక్‌బాబు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొలకలూరు కోటేశ్వరరావు, అత్తోట జోసఫ్, నియోజక వర్గం ఎన్నికల అధికారి బసవ పున్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యలవర్తి సురేష్, బొల్లిముంత ఏడుకొండలు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గాజులవర్తి సుధీర్, పెరికల పద్మారావు, మోదుకూరి హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

74 శాతం ఉద్యోగస్తులు ఓటుహక్కు వినియోగం

బాపట్ల: ఎన్నికల విధుల్లో ఉండి అంతర్ జిల్లాలో ఓటుహక్కు కలిగిన ఉద్యోగులు మంగళవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదు చేసుకున్నారు. మొత్తం 3531 మంది ఓటర్లు ఓటు పొందేందుకు నమోదు చేసుకోగా 2605మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1607మంది కాగా, మహిళలు 998మంది ఉన్నారు. 74శాతం ఓటుహక్కును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా తెలిపారు. తొలుత ఆయన బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం రేపల్లె ఆర్డీఓ కార్యాలయంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, రేపల్లె ఆర్డీఓ హేలా షారోన్ ఉన్నారు.



బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

క్లుప్తంగా

ఆశ కార్యకర్తల పనితీరు మెరుగవ్వాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ



చీరాల టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు పని తీరు మెరుగుపర్చుకుని ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు సక్రమంగా వైద్య సేవలు అందించాలని బాపట్ల జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ సూచించారు. మంగళవారం ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో జరుగుతున్న సమావేశాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విజయమ్మ మాట్లాడుతూ వేసవిలో ఎండలు విపరీతంగా కాస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుగా వడదెబ్బలు తగలకుండా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు సక్రమంగా అందించాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

కఠెవరం పొలాల్లో జార్ఖండ్ వాసి మృతదేహం

తెనాలి రూరల్: తెనాలి మండలం కఠెవరం పొలాల్లో జార్ఖండ్ వాసి మృతి చెంది ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. మృతదేహం వద్ద సెల్‌ఫోన్ ఉండడంతో దాని ద్వారా అతను జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సోరెన్ విజయ్(39)గా గుర్తించారు. తన తోటి కూలీలతో కలసి చెన్నైలో పనులకు వెళ్తూ ఆదివారం తెనాలిలో రైలు దిగి అది కదిలే లోపు ఎక్కలేకపోయాడు. సోమవారం ఉదయం పట్టాల వెంబడి నడుచుకుంటూ కఠెవరం పొలాల వైపు వచ్చి బహిర్భూమికి వెళ్లి రైలు కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించి అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు పక్షపాతి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణా రావు, వైఎస్సార్ సీపీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌కు హారతులు పడుతున్న తుమ్మల గ్రామ ప్రజలు

రేపల్లె రూరల్: రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ప్రోత్సహిస్తూ పలు పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం రేపల్లె మండలంలోని వివిధ గ్రామాలలో పార్టీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌తో కలిసి చేసిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు అయితే వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఏటా ఖరీఫ్‌కు ముందుగానే పెట్టుబడి సాయంను అందజేస్తూ రైతులపై భారం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరఫరా చేయటంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. రైతులే కాకుండా అన్ని రంగాలలోని వారికి జగనన్న అండగా నిలిచారని గుర్తు చేశారు. దీంతో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారని, దీనికి నిదర్శనమే రేపల్లె పట్టణంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరవ్వటమన్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్న సిద్ధాంతాన్ని నమ్మిన జగనన్న రైతులకు అన్నివేళలా అండగా ఉంటున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకు రైతులు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలోనే సచివాలయాలను నెలకొల్పి ప్రభుత్వ సేవలను ప్రజల ముగింటకు చేర్చిన జగనన్నను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్‌ను, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి అయిన తనను గెలిపించాలని గణేష్ ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా పోటుమెరక, వడ్డీవారిపాలెం, బొందలగరువు, తుమ్మల, మోళ్లగుంట, గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గణేష్‌కు హారతులిచ్చి బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, నాయకులు గరికపాటి భానుకోటి, పీతా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని సాధించుకుందాం

ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ, ఎమ్మెల్సీ తూమాటి

యద్దనపూడి: పేదల వైపు జగనన్న అండగా ఉంటే, పెత్తందారుల వైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా, బీజేపీ అండగా ఉన్నాయి.. అందుకే పెత్తందారులను సాగనంపి మరోమారు సంక్షేమ ప్రభుత్వాన్ని సాధించుకుందామని వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి, యద్దనపూడి, గన్నవరం, వింజనంపాడు గ్రామాల్లో ఎమ్మెల్సీ తూమాటి మాధవ రావుతో కలిసి యడం బాలాజీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని చంద్రబాబు మూడు పార్టీలతో పొత్తు పెట్టుకుని అలివి కాని హామీలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు, ఎంపీపీ పులగం రజినీ, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డా బ్రహ్మానందం, జంపాని కోటేశ్వరరావు, మువ్వల రాంబాబు, సన్నెబోయిన వెంకటప్పయ్య, రావూరి వేణుబాబు, నక్కా పోతిరెడ్డి, మానుగొండ శ్రీనివాసరెడ్డి, చిలుకూరు కృష్ణయ్య, ధూళిపాళ్ల వేణు, చెరుకూరి వేణు, తూబాటి బాలకృష్ణ, సర్పంచ్‌లు ఎమేలమ్మ, సుమలత, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాగర్లమూడిలో ప్రచారం నిర్వహిస్తున్న అసెంబ్లీ యడం బాలాజీ, ఎమ్మెల్సీ మాధవరావు

సైకిల్‌కు త్వరలో పంక్చర్ ఖాయం



ముస్లింలతో మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి

- సూపర్ సిక్స్ పథకాలన్నీ మోసమే
- వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ స్పీడుతో టీడీపీ సైకిల్‌కు పంక్చర్ పడక తప్పదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పుట్టావారిపాలెం (అడ్డరోడ్డు), పాతమాగులూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు కైపు మహేశ్‌రెడ్డి, కై పు సుష్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ గ్రామానికి వచ్చిన ప్రియతమ నాయకుడికి ప్రజలు డప్పు వాయిద్యాలతో పూల జల్లుతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రభుత్వంలో ఎవరికేమి మేలు జరిగిందో వివరిస్తూ, చిన్న పిల్లలను, పెద్దలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వపాలనకు ప్రజలే తేడా చెప్తున్నారన్నారు. దాంతో వారంతా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవాలని చూస్తున్నారని చెప్పారు. ప్రజల గుండెల్లో నిలిచిన ప్రజా నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయితే వారి గుండెల్లో గుడికట్టుకున్న వ్యక్తి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ఒంటరి పోరాటమే ఆయన నిజాయతీకి, తాను అందించిన పాలన పట్ల ఉన్న విశ్వాసమన్నారు. అబద్ధాలు చెప్పడం చేతనైతే ఆయన ఎప్పుడో ముఖ్యమంత్రి అయి ఉండేవారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ వంటి ప్రజాకర్షక పథకాలు వినడానికి తప్ప అమలు చేయడానికి సాధ్యం కానివన్నారు. గతంలో చంద్రబాబు మోసాలు తెలిసిన వారెవరూ ఆ పథకాలు నమ్మడం లేదని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసే పథకాలతో ప్రజారంజకంగా సాగిన వైఎస్సార్ సీపీ పాలన కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని చెప్పారు. ఈనెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో అద్దంకిలో తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేశ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టభద్రులైన విద్యావంతులు ఉపాధి కల్పన కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఇంట్లో నుంచే ఆన్‌లైన్ విధానంలో ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసు కోవచ్చునని జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు తెలిపారు. మంగళవారం గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో మాట్లాడారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు www.em poyment. ap.gov.in సైట్‌కు మొబైల్, ఆధార్ నంబరు, ఈ–మెయిల్ ద్వారా లాగిన్ అయ్యి సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు జాబ్‌మేళాలను నిర్వహించే సమయంలో వాటి సమాచారం నేరుగా చేరుతుందని చెప్పారు. రెన్యువల్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లోనే చేసుకోవచ్చునని సూచించారు. ఎంప్లాయిమెంట్, రెన్యూవల్ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 48 గంటల లోగా ఎంప్లాయిమెంట్ కార్డు జనరేట్ అవుతుందని తెలిపారు. జిల్లాలో విద్యావంతులైన నిరుద్యోగ యువతీ, యువకులు ఎంప్లాయింట్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీలో గుర్తింపు లేక వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన కుక్కలవారిపాలెం గ్రామపెద్దలు

బాపట్ల: మండలంలోని కుక్కలవారిపాలెం గ్రామ పెద్దలు ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి మంగళవారం చేరారు. 25 సంవత్సరాలుగా టీడీపీలో ఉన్నప్పటికీ ఆ పార్టీలో గుర్తింపు లేకపోవటంతో వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని గ్రామపెద్దలు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో గ్రామపెద్ద కుక్కల రమణారెడ్డి, గంపాల నాగార్జునరెడ్డి, మున్నం రమణారెడ్డితోపాటు 25 మందికిపైగా పెద్దలు ఉన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

జగనన్న హయాంలోనే పేదల జీవితాల్లో వెలుగులు

- గెలిపించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్
- చిన్నబజార్, ఆణుమల్లిపేటలో ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు



ప్రచారం నిర్వహిస్తున్న వెంకటేష్

వేటపాలెం: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ పరిధిలోని ఆణుమల్లిపేట, చిన్నబజార్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. అయన వెంట పార్టీ నాయకులు, పార్టీ శేణులు భారీ ఎత్తున అనుసరించారు. ప్రతివీధిలో పూలుజల్లుతూ వెంకటేష్‌కి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలైన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈనెల 13న జరగబోవు ఎన్నికల్లో ఫాన్ గుర్తుపై ఓటు వేసి తనకు, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని ప్రజల్ని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, సర్పంచ్ కందేటి రమణ, మహిళా అధ్యక్షురాలు మద్దులూరి సీతామహాలక్ష్మి, కంచి సాంబిరెడ్డి, పిన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి, అందె కృష్ణ, బుద్ధి రవి, మిరియాల రాఘవయ్య, కర్పూరపు రమాదేవి, నర్మదా ప్రశాంతి, కట్ట జార్జి శ్యామేలు, జమ్మి ప్రసాద్‌రెడ్డి, జిడుగు మస్తాన్, ప్రతి వెంకట సుబ్బారావు, చుండూరి వెంకట రమణ, రాజశేఖర్, బండి కళ్ల నరేష్, చిట్టిబాబు, దావీదు, పింజల శంకర్రావు, బొడ్డుకోట సుబ్బారావు, మధుర రివి నజ్మా, కప్పల హేన్నా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వర్ణలో ఐదు పూరిళ్లు దగ్ధం



ఆహుతైన గుడిసెలు

కారంచేడు: గుడిసెలో నుంచి ఎగసిపడిన చిన్న నిప్పురవ్వల కారణంగా ఐదు పూరిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈఘటన మండలంలోని స్వర్ణ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ వీఆర్‌ఓ సతీష్ కుమార్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యానాది కాలనీలో పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న ఇల్లి ప్రసాద్, గున్నం హుస్సేన్, గున్నం అంకమరావు, మేకల శంకరయ్య, ఇల్లి చిన్నయ్యల ఇళ్ల పక్కపక్కనే ఉంటాయి. వీరందరూ మంగళవారం ఉదయం మిరపకాయ కోతలకు వెళ్లారు. ఈసమయంలో ఒక ఇంటి పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇళ్లు పూర్తిగా ఆహుతయ్యాయి. ఐదు పూరి గుడిసెల నుంచి సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. సర్వం కోల్పోయామని బాధితుల రోదనలతో ప్రాంతమంతా నిండిపోయింది. చుట్టు పక్కల వారు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. చీరాల అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు తెలిపారు. తక్షణ సాయంగా నిత్యావసరాలు అందిస్తామన్నారు. వీఆర్‌ఓ సతీష్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసరావులు నివేదికను సిద్ధం చేశబూరు.

వడ్డెర సామాజికవర్గాన్ని ఆదరించింది జగనన్నే

అద్దంకి రూరల్: వడ్డెర సామాజిక వర్గాన్ని ఆదరించింది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు ప్రకటిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తన్నీరు ధర్మరాజు మాట్లాడుతూ జగనన్న బీసీ కులాలకు వెన్నుదన్నుగా ఉండి అన్నిరకాలుగా ఆదుకుంటున్నారన్నారు. బీసీలో వడ్డెర సామాజిక వర్గానికి దేవస్థానాల్లో ట్రస్ట్ బోర్డు చైర్మన్‌లుగా, మెంబర్లుగా చేయటమే కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలుగా రాజ్యసభ సభ్యుడిగా కూడా ఎంపిక చేశారన్నారు. కూటమిలో ఇచ్చే హామీలన్నీ మోసపూరితమని, వాటిని ఎవరు నమ్మవద్దన్నారు. వడ్డెరులకు ఎంతో ప్రయోజనాలు చేకూర్చిన జగనన్నను గెలిపించుకోవడానికి కృషి చేస్తామన్నారు. అద్దంకి అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి, ఎంపీ నందిగం సురేష్ గెలుపునకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వై.మాధవి, అద్దంకి పట్టణ 20 వవార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

పల్నాడు జిల్లాలో ఘటన

సంతమాగులూరు (అద్దంకి): పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లాలోని ముప్పాళ్ల మండలంలోని కుదుర్తివారి పాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. అందిన సమాచారం మేరకు సంతమాగులూరు గ్రామానికి చెందిన జమ్ముల గోపి (35) గొర్రెలు కాచుకుంటూ జీవిస్తుంటాడు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం గ్రామంలో మేత లేకపోవడంతో పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలోని కుందుర్తివారిపాలెం గ్రామానికి గొర్రెలు తోలుకు వెళ్లాడు. పొలంలో గొర్రెలు మేపుతుండగా వర్షం ప్రారంభమై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య వీరనాగమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న తండ్రి, భార్య శోక సంద్రంలో మునిగిపోయారు. మొత్తం మీద కుటుంబానికి ఆధారమైన పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిది అయింది.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిపై దాడి.. టీడీపీ నేతలపై కేసు

నరసరావుపేట టౌన్: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కిడ్నాప్‌తో పాటు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సి.హెచ్.కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. రెడ్డినగర్ ప్రాంతానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి మధిర సత్యనారాయణ రెడ్డి స్నేహితుడు (ప్రభుత్వ ఉద్యోగి) పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల వద్ద దిగబెట్టాలని కోరగా వెళ్లాడు. ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వాహనాలపై వచ్చి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకునేందుకు కళాశాల గేటు తోసుకుని బలవంతంగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ ప్రత్యేక బలగాలు లోపలికి అనుమతి లేదని వారితో హిందీలో వారించారు. విషయాన్ని గమనించిన సత్యనారాయణ రెడ్డి కలుగచేసుకుని లోపలికి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నట్లు వారికి చెప్పాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు నువ్వు ఎవర్రా..మాకు చెప్పేదంటూ సత్యనారాయణరెడ్డి పై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. అతని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని బలవంతంగా కారులో ఎక్కించుకుని కొట్టుకుంటూ కళాశాల వెనుక ప్రాంతానికి తీసుకెళ్లారు. తాను రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగినని ప్రాధేయ పడడంతో విడిచి వెళ్లారు. తనను కిడ్నాప్ చేసి దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు క్రాంతి ట్రాన్స్‌పోర్టు శివ, బీసీ కాలనీ ప్రాంతానికి చెందిన రౌడీ షీటర్ రమేష్, ఇస్లాంపేట బాబులతో పాటు మరికొందరిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సిహెచ్. కృష్ణారెడ్డి తెలిపారు.

టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా

అమరావతి: మండల కేంద్రమైన అమరావతి టీడీపీ కార్యాలయం ముందు మంగళవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. ఇటీవల వైఎస్ఆర్‌సీపీ నుండి అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు భారతీయ జనతాపార్టీలో చేరారు. మంగళవారం కూటమిలో పార్టీ నాయకుడైన మేకల హనుమంతరావు ఇంటికి టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ వెళ్లి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో అమరావతి గోపాల్‌నగర్‌లోని యాదవ సామాజిక వర్గానికి చెందిన కొందరు ఈ పరిణామాన్ని వ్యతిరేకిస్తూ సుమారు 150 మంది వచ్చి స్థానిక టీడీపీ ఎన్నికల కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. మండల స్థాయి నాయకులు ఎంత సర్ది చెప్పినా వారు వినలేదు. తాము గత ఐదు సంవత్సరాల్లో ఎంతో మానసిక క్షోభ అనుభవించామని, అర్థికంగా కూడా నష్టపోయి కేసులు పెట్టించుకున్నామని వారు వాపోయారు. తమపై కేసులు పెట్టి అరెస్టులకు తాళలేక ఊరు వదిలి వెళ్లామని, మా బాధలు ఇలా ఉంటే మీరు వెళ్ళి కలవటాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కార్యకర్తలు బిగ్గరగా కేకలు వేశారు.

సంక్షేమ పథకాలను ఆపేసే కుట్ర



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ ఏసురత్నం

- వైఎస్సార్ చేయూతను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటు
- వచ్చే ఎన్నికల్లో బాబుకు మరోసారి బుద్ధి చెప్పాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

పట్నంబజారు: సంక్షేమ పథకాలను ఆపేసే కుట్రలను తెలుగుదేశంపార్టీ యథేచ్ఛగా కొనసాగిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి పలు చేరికలు జరిగాయి. స్థానిక శ్యామలానగర్ రెండోలైనులోని మంత్రి నివాసానికి చేరుకుని వీరంతా పార్టీలో చేరారు. పలు ప్రాంతాల నుంచి 50 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కుట్రలు, కుతంత్రాలకు విసిగిపోయే గత ఎన్నికల్లో ఆయన్ను భారీ తేడాతో ఓడించారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురేయడం ఖాయమని చెప్పారు.

37వ డివిజన్ నుంచి..

టీడీపీ నుంచి 20 మందికిపైగా కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరంతా 37వ డివిజన్, చంద్రమౌళినగర్ నుంచి వచ్చారు. పార్టీ యువజన విభాగం నాయకుడు గూడపాటి వెంకటసుభాష్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. చేరిన వారిలో శ్రీలక్ష్మి, అలేఖ్య, రఘు, సుభాని, దివ్య, భార్గవి, రవి ఉన్నారు. 44వ డివిజన్ నుంచి పార్టీ సీనియర్ నాయకుడు కాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసేనకు చెందిన పలువురు నాయకులు చేరారు. ముళ్లపూడి రామబ్రహ్మం (బుల్లి), నగరం శంకరరావు పార్టీలో చేరిన వారిలోఉన్నారు. పార్టీ 20వ డివిజన్ అధ్యక్షుడు ఖాజా మొయిద్దీన్ ఆధ్వర్యంలో 15 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. షేక్ అతిక్, మున్నా, సాదిక్, సలాం, ఖాజా, మోహన్ తదితరులు ఉన్నారు.

తల్లీ-కూతురు ఉసురు తీసిన పిడుగులు

క్రోసూరు: పిడుగుపడి తల్లీకూతురు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఊటుకూరులోని ఎస్సీ కాలనీకి చెందిన బొందెల నాగేంద్రమ్మ(53), కూతురు నాగరాణి(33)తో కలసి మొక్కజొన్న పనులకు వెళ్లారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో పిడుగుపడడంతో ఇద్దరు మృతి చెందారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న వీఆర్వో మస్తాన్‌వలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మళ్లీ నువ్వే రావాలి..



నరసరావుపేట రూరల్: దొండపాడులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జగనన్న నువ్వే మళ్లీ రావాలి అంటూ ప్లకార్డు పట్టి ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాను గుర్తుకే మీ ఓటు.. అంటూ బొమ్మలతో ఆకట్టుకున్నారు. జగన్ మామయ్య మళ్లీ వస్తేనే అమ్మ ఒడి, విద్యా కానుక వస్తాయని, గోరు ముద్ద అందుతుందని చిన్నారులు చెప్పడం అందరిని ఆలోచింపజేసింది.

కదలిన నారీ లోకం



నరసరావుపేట రూరల్: ఎన్నికల ప్రచారంలో నారీ లోకం కదిలింది. మండలంలో పర్యటించిన వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం పలికింది. దొండపాడులో అధిక సంఖ్యలో మహిళలు వారికి హారతులు పట్టి, విజయ తిలకం దిద్దారు. కేసానుపల్లిలో గుమ్మడి కాయలతో దిష్టితీశారు.

ఇంగ్లిష్ మీడియం తెచ్చిన ఒకే ఒక్క సీఎం జగన్

సినీ రచయిత కోన వెంకట్



కర్లపాలెం: పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోన రఘుపతి, నందిగం సురేష్‌కు మద్దతుగా మంగళవారం ఆయన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని సమ్మెటవారిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దారని చెప్పారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి, తమ మద్దతు తెలపాలని కోన వెంకట్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బెనర్జి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నీ అభిమానం చల్లగుండా..

- ఐస్‌క్రీమ్ బండి నిర్వాహకుడే స్టార్ క్యాంపెయినర్
- జగనన్న మళ్లీ సీఎం కావాలంటూ బైక్‌పై ప్రచారం



యడ్లపాడు: సాధారణ ప్రజలే వైఎస్సార్ సీపీకి ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లుగా మారారు. నవరత్నాలు పథకాలతో తమకు ఎంతో ఇచ్చిన సీఎం జగనన్నకు అందులో కొంతైనా తిరిగివ్వాలని నిర్ణయించుకున్నారు. తమ ఊరి బడి రూపురేఖలు మార్చి, తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు ఇంగ్లిష్ మీడియం తెచ్చిన.. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఇలా బండి కట్టుకుని ఉప్పరపాలేనికి చెందిన విప్పర్ల జాన్సన్ ఊరూరా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. తను ఐస్‌క్రీమ్ బండి నిర్వహిస్తూ జీవిస్తున్నానని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక తన బిడ్డల చదువులకు భరోసా లభించిందని చెప్పుకొచ్చాడు. ఇంకా కొన్ని జాన్సన్ మాటల్లోనే...' మా గ్రామంలోని పాఠశాలకు ఐదేళ్ల కిందట ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మారాయి. ప్రతి సబ్జెక్టు ఒక టీచర్ ఉన్నారు. మా పిల్లలే కాదు ఊరిలోని పేదలందరి పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదివే గొప్ప అవకాశం కలిగింది. ఇవన్నీ నాకు స్ఫూర్తిని రగిల్చాయి. నేను ఎందుకు వైఎస్సార్ సీపీ స్టార్ క్యాంపెయినర్ కాకూడదని భావించాను. అందుకే నా సొంత వాహనానికి ప్రచార సెట్టింగ్ ఏర్పాటు చేసుకున్నాను. సమావేశాలు, సభలకు, నామినేషన్ల సమయంలో విస్తృతంగా పాల్గొన్నా.. సీఎం జగన్ పథకాలు, వివిధ సభల్లోని ఆయన ప్రసంగాలను ఊరూరా వినిపిస్తున్నాను. చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నాను.'



వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీ వ్యూ..

పేదల కల..సాకారం ఇలా

సగటు జీవుడి సంపాదనలో ముప్పావంతు ఇంటి అద్దె, పిల్లల విద్య, వైద్యానికే సరిపోతుంది. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సొంత ఇల్లు అనేది ఒక కల. ఆ కలను సాకారం చేసింది.. సీఎం జగన్. ఆయన అధికారంలోకి వచ్చాక పేదల జీవన ప్రమాణాల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. నిలువ నీడలేని పేదవారికి సొంతిల్లు అనేది ఎంత ముఖ్యమో గుర్తించారు. ఇందుకు జగనన్న కాలనీలతో ఒక గృహ యజ్ఞమే చేశారు. స్థలమివ్వడమే కాకుండా..ఇంటి నిర్మాణానికి నగదు ఇచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. ఇసుక, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని రాయితీపై అందించింది. ఇంటి స్థల రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయించింది. కాలనీలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, రోడ్లు ఇలా అన్ని మౌలిక వసతులు కల్పించింది. దాదాపు ఒక్కో కుటుంబాన్ని రూ.5లక్షల నుంచి రూ. 10లక్షల వరకు స్థిరాస్తిపరులను చేసింది. ఇప్పుడు ఆ జగనన్న కాలనీ వనాలు వికసించి నూతన ఊళ్లుగా వెలుగొందుతున్నాయి.

నరసరావుపేట:
పల్నాడు జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.. ఈ కాలనీలను దూరం నుంచి చూస్తుంటే ఒక ఊరు నిర్మాణం జరుగుతున్నట్లుగా కన్పిస్తున్నాయి. నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీ–అందరికీ గృహాలు పథకంపై పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో 42,012మందికి స్థలాలు కేటాయించారు. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలంలో ప్రతి ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు అందజేశారు. ఇసుక ఉచితంగా ఇవ్వటంతో పాటు ఇంటికి కావాల్సిన సిమెంటు, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేశారు.

డీ'సెంటు' హౌస్

పల్నాడు జిల్లా ఏర్పడక ముందు కేవలం 5,200 గృహాల నిర్మాణమే సాగింది. 2022 ఏప్రిల్ 4న జిల్లా ఏర్పడిన తర్వాత నియోజకవర్గాల ఎమ్మెల్యేల సహకారంతో ఆ సంఖ్య పెరిగింది.

- చిలకలూరిపేటలో 4,377మందికి పట్టాలు ఇవ్వగా 4,361 మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 648 గృహాలు పూర్తయ్యాయి.
- నరసరావుపేట పట్టణంలో 5,892 మందికి స్థలాలు ఇవ్వగా 5,886 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 862 గృహాలు పూర్తయ్యాయి.
- వినుకొండలో 6,423మందికి గాను 6,181మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా.. 733 గృహాలు పూర్తయ్యాయి.
- గురజాలలో 5,218మందికి స్థలాలు ఇవ్వగా 5,187మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. 747ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.
- మాచర్లలో 4,478 మందిలో 4405 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా 178 ఇళ్లు పూర్తయ్యాయి.
- సత్తెనపల్లిలో 5,017 మందికి స్థలాలిస్తే.. 4,984మంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించి..1,313 మంది పూర్తి చేసుకున్నారు.
- పెదకూరపాడులో 10,607 మందికి స్థలాలివ్వగా 10,379 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టి 1,857 గృహాల నిర్మాణం పూర్తయ్యింది.
- నరసరావుపేట పురపాలక పరిధిలోని వారికి వినుకొండ రోడ్డులోని ఉప్పలపాడు–లింగంగుంట్ల మధ్యన గుంటూరు–కర్నూలు రహదారికి 200 మీటర్ల దూరంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో 100 ఎకరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేశారు.
- అలాగే చిలకలూరిపేటరోడ్డులోని టిడ్కో గృహాలకు ఎదురుగా ఖాళీగా ఉన్న 45 ఎకరాల్లో స్థలాలు అందజేయగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు.
- పిడుగురాళ్ల ఆదర్శ నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో 1,320మందికి స్థలాలు ఇవ్వగా 1,120 గృహాల నిర్మాణం వడివడిగా సాగుతోంది.


వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో సెంటు స్థలంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇల్లు

- జగనన్న కాలనీల్లో కళకళలాడుతున్న డీసెంట్ హౌస్‌లు
- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు
- 19,631కు పెరిగిన గృహ నిర్మాణాల సంఖ్య
- సొంతింటితో పేదలను స్థిరాస్తిపరులను చేసిన సీఎం జగన్
- నిలువ నీడ కల్పించారంటూ లబ్ధిదారుల హర్షం


జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సొంతిల్లు అస్సలు ఊహించ లేదు



పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో నెలకు రూ.3 వేలు అద్దె చెల్లించుకుంటూ రేకుల షెడ్డులో ఉండే మా కుటుంబానికి సీఎం జగన్ దేవుడిలా సెంటు స్థలం, డబ్బులు ఇస్తే ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నాం. పది నెలల నుంచి నివాసం ఉంటున్నాం. సొంత ఇల్లు ఏర్పడుతుందని కలలో కూడా ఊహించ లేదు.

– కేతావత్ పార్వతీ, జగనన్న కాలనీ, వినుకొండ రోడ్డు

పది నెలల నుంచి నివాసం



చిరు సంపాదనతో బీసీ కాలనీలో అద్దె ఇంటిలో ఉంటున్న మాకు సీఎం జగన్ సెంటు స్థలమిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో పాటు మేము కొంత వేసుకొని ఇంటి నిర్మాణం పూర్తిచేకున్నాం. పది నెలల నుంచి హాయిగా ఉంటున్నాం. ఇప్పుడు నెలకు రూ.2,500లు అద్దె చెల్లించే పని తప్పింది.

– షేక్ కరీమూన్, జగనన్న కాలనీ, వినకొండరోడ్డు

అత్యాధునిక నిర్మాణ సామగ్రి

గృహ లబ్ధిదారులకు ఇచ్చే డబ్బుల్లోనే ఇంటికి కావాల్సిన సామగ్రిని ప్రభుత్వమే రాయితీపై అందజేసింది. పౌడర్ కోటెడ్ గాల్వనైజ్డ్ డోర్ ఫ్రేమ్ రూ.2,982కు, విద్యుత్ విభాగానికి చెందిన 19 వస్తువులతో కూడిన కిట్ రూ.5,730లకు, నీటి సరఫరా, డ్రైనేజ్‌కు ఉపయోగించే 10 వస్తువులతో కూడిన సెట్‌ను రూ.4,410లకు, రూ.975 విలువైన టాయిలెట్ సెట్‌ను అందజేసింది.


వినుకొండరోడ్డులోని జగనన్న కాలనీలో ఇంటిని అందంగా తీర్చిదిద్దిన లబ్ధిదారు

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన


జేఎన్‌టీయూలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ బిందుమాధవ్

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూ ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలోని పోలింగ్ కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి, అక్కడ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని తెలపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వాహనాల పార్కింగ్‌కు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ వినాయకం, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజనాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న వృద్ధులు



చీరాల టౌన్: ఇంటి నుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు రెండు రోజులు హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. చీరాల రూరల్, మున్సిపాలిటీ, వేటపాలెం మండలంలో మొత్తం 225 మందికి హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మొదటిరోజు మంగళవారం 103 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్వో వెల్లడించారు. చీరాల మండలంలోని గవినివారిపాలెంలో జరుగుతున్న హోం ఓటింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అలానే మున్సిపాలిటీలో జరుగుతున్న ఓటింగ్‌ను మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, ఏఈఆర్వో పి.చక్రవర్తి పరిశీలించారు. బుధవారం హోం ఓటింగ్ జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు విధిగా వారి నివాస గృహాల్లో అందుబాటులో ఉండాలని కోరారు. నియోజకవర్గంలో హోం ఓటింగ్‌కు ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేశామని ఆర్వో తెలిపారు.

ప్రచార చిత్రం


గుంటూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్‌బాబుతో కరచాలనం చేస్తున్న మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి విడదల రజిని, పక్కన ఎమ్మెల్యే గిరిధర్


గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో సోడా కలుపుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా

దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కోన రఘుపతి పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమ భవన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ట్రై సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేయటం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య, మల్లెల మౌనిక, గుంజి ఏడుకొండలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

అధికారంలో ఉంటే అలా.. లేకుంటే ఇలా

- 2015 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నేతల బరితెగింపు
- ఎమ్మెల్సీగా ఏఎస్ రామకృష్ణ గెలుపు కోసం అధికార దుర్వినియోగం
- టీడీపీ మద్దతిచ్చిన అభ్యర్థినే గెలిపించాలని ఉపాధ్యాయులకు బెదిరింపులు
- టీడీపీ అభ్యర్థి గెలుపు కోసమే పని చేసిన అప్పటి మంత్రులు ప్రత్తిపాటి, నారాయణ
- పొరపాటున మళ్లీ బాబు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ప్రస్తుత బ్యాలెట్ ఓటింగ్‌లోనూ టీడీపీ నాయకుల ప్రలోభాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అధికారం కోసం విచ్చలవిడిగా హామీలు ఇచ్చే చంద్రబాబు... అధికారంలో ఉంటే హిట్లర్ మించిన నియంతను తలపింపజేస్తాడు. సార్వత్రిక ఎన్నికల్లో ఏం చేసినా గెలవాలనే తాపత్రయంలో ఉన్న చంద్రబాబు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పిస్తున్నారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఉపాధ్యాయులను బెదిరించిన ఘటనలను ఉపాధ్యాయ లోకం ఎప్పటికీ మరువదు. 2015 మార్చి 22న జరిగిన గుంటూరు, కృష్ణా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును ఓడించేందుకు ఎమ్మెల్యేలు, మంత్రులతో పాటు సాక్షాత్తూ సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు చేసిన అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. పార్టీ మద్దతు ఇచ్చిన ఏఎస్ రామకృష్ణను టీచర్ ఎమ్మెల్సీగా గెలిపించుకునే క్రమంలో టీడీపీ నేతలు ఎంతగా బరితెగించారంటే, ఉపాధ్యాయ వర్గాల్లో బలమైన నేతగా ఉన్న లక్ష్మణరావు వెంట మద్దతుగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులను మంత్రులు స్వయంగా తమ కార్యాలయాలకు పిలిపించుకుని బెదిరింపులకు దిగారు. లక్ష్మణరావుకు మద్దతుగా ఉన్న యూటీఎఫ్ సహా అనేక ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులను పిలిపించుకుని టీడీపీ మద్దతు ఇచ్చిన ఏఎస్ రామకృష్ణను ఎమ్మెల్సీగా గెలిపించాలని చంద్రబాబు స్పష్టంగా చెప్పారని, ప్రభుత్వం నుంచి జీతాలు పొందుతున్న మీరందరు(టీచర్లు) తాము చెప్పిన అభ్యర్థికే ఓటు వేయాలని బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సందర్భాలను ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎప్పటికీ మరచిపోలేరు. మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నారాయణ, శిద్దా రాఘవరావు తాము చెప్పినట్లు నడుచుకోకుంటే గ్రాంటు, జీతాలు నిలిపివేస్తామని ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలను, టీచర్లను బెదిరించారు. రెండు జిల్లాల్లోనూ టీడీపీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు సాగించిన దందా, అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని అధికారులపైనా తీవ్ర ఒత్తిడి తేవడంతో పాటు సీఎం హోదాలో చంద్రబాబు నేరుగా సంఘాల నాయకులతో ఫోన్‌లో మాట్లాడి హుకుం జారీ చేశారు. చంద్రబాబు పాలనలోని చీకటి రోజులను గుర్తు చేసుకుంటున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు పొరపాటున మళ్లీ బాబు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉన్నారు. ప్రస్తుత బ్యాలెట్ ఓటింగ్‌లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు టీడీపీ నాయకులు తీవ్ర ప్రలోభాలు గురి చేస్తుండటంపై టీడీపీ దౌర్జన్యకాండ అప్పుడే మొదలైందని ఆందోళన చెందుతున్నారు. హుందాగా జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికలను టీడీపీ అధికార, ధనబలంతో కలుషితం చేసిందని అప్పట్లో ఓటమి పాలైన కేఎస్ లక్ష్మణరావు బహిరంగంగా ఆరోపించారు. నైతిక విలువలను పాతరేసి డబ్బు విరజిమ్మి ఓట్లు కొనుగోలు చేశారని టీడీపీపై మండి పడ్డారు.

ఆ..1,219 మంది ఉద్యోగులు మళ్లీ ఓటేయండి

- 5న పోస్టల్ బ్యాలెట్‌కు బదులు, ఈవీఎం బ్యాలెట్‌లు పంపిణీ
- సిబ్బంది పొరపాటు నేపథ్యంలో అవి చెల్లని ఓట్లుగా వెల్లడి
- నరసరావుపేట లోక్ సభకు రేపు, ఎల్లుండి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్
- చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని వారికి మాత్రమే
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి

చిలకలూరిపేట: నరసరావుపేట పార్లమెంటు స్థానానికి సంబంధించి చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ బుధ, గురు వారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. చిలకలూరిపేట తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 5న గణపవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టల్ పోలింగ్ ప్రక్రియ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సంబంధించి నిర్వహించినట్లు చెప్పారు. అయితే సిబ్బంది తప్పిదం కారణంగా నరసరావుపేట లోక్ సభ స్థానానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్లకు బదులు, ఈవీఎం బ్యాలెట్లు ఓటర్లకు అందజేయడం జరిగిందన్నారు. ఈ పొరపాటు నేపథ్యంలో 1,219 లోక్ సభ స్థానానికి వేసిన ఓట్లు చెల్లవని వెల్లడించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ స్థానం వదిలివేసి కేవలం పార్లమెంటు స్థానానికి సంబంధించి ఈ నెల 8, 9 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిరిగి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కలిగి కేవలం ఐదో తేదీన ఓటు వేసిన ప్రతి ఒక్కరూ తిరిగి నిర్వహిస్తున్న ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని, వారి ఓటు హక్కు ఉపయోగించుకోవాలని కోరారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి అతి తక్కువ సమయంలో ఓటు హక్కు ఉపయోగించుకొని నిమిషాల వ్యవధిలో వెళ్లిపోయే ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పొరపాటు ఘటనకు బాధ్యుడైన ఏఆర్‌వో వరకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నూతన పద్ధతిలో నగదు పంపిణీకి ప్రయత్నం

- ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ఓటరు స్లిప్పులు, జాబితా
- ఓటరు స్లిప్పులపై బార్‌కోడ్‌తో ఉన్న హోలోగ్రామ్..
- సమాచారం మేరకు అడ్డుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- తనిఖీ చేసి, ఆర్వో కార్యాలయానికి తరలించిన పోలీసులు


రెంటచింతలలో నిలిపిన యామిని ట్రావెల్ బస్సు

రెంటచింతల: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నూతన పద్ధతిలో ఓటర్లకు టీడీపీ నగదు పంపిణీ చేయడానికి ప్రయత్నించగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు ముందస్తు.. విశ్వసనీయ సమాచారం మేరకు వెంటనే పోలీసులకు విషయం తెలిపారు. గుంటూరు నంచి మాచర్లకు వస్తున్న యామిని ట్రావెల్ బస్సులో టీడీపీకి చెందిన నగదు పెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులకు తెలియడంతో.. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు నేతృత్వంలో రెంటచింతల ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ పగిడి అనీల్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి మాచర్లకు వస్తున్న ఈ ట్రావెల్ బస్సును గురజాల శివారులోని గొట్టిముక్కల మేజర్ కాల్వ సమీపంలో నిలిపి సోదాలు చేపట్టారు. విషయం బయటకు రావడంతో.. వైఎస్సార్ సీపీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. బస్సులోని లగేజ్ స్టోర్‌లో సుమారు 15 అట్ట పెట్టెలు, 10 తెల్లగోతాల్లో ఓటర్ స్లిప్‌లు, ఓటర్ జాబితాలు ఉండటం పోలీసులు గమనించారు. అనుమానం వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు బస్సులో నగదు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేయడంతో వెంటను ఆ బస్సును మాచర్ల పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ శ్యామ్‌ప్రసాద్‌కు అప్పగించారు. ఓటర్ల స్లిప్‌లపై బార్‌కోడ్‌తో ఉన్న హోలో గ్రామ్ ఉండటంతో ఇది కొత్త పద్ధతిలో ఓటర్లకు నగదు పంపిణీ చేయడానికి ఉపయోగపడుతుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ఓటర్లకు నేరుగా ఈ స్లిప్‌లు అందచేసి తరువాత ఈ స్లిప్‌లు ఆదారంగా నగదును పంపిణీ చేయవచ్చని దీంతో ఎవరికీ అనుమానం వచ్చే అవకాశం ఉండదని భావించినట్లు తెలుస్తోంది. మాచర్ల నియోజకవర్గం గ్రామాల్లోని స్థానిక నాయకుల వల్ల ఓటర్లకు చేరాల్సిన నగదు పక్కదారి పట్టకుండా నూతన పద్ధతిలో ఈ విధానం అమలుచేయడానికి టీడీపీ వారు ప్రత్నించినట్లు చర్చించుకుంటున్నారు. పల్నాడు ప్రాంతంలో ఈ విషయంపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో బస్సులో రూ. 20 కోట్లు నగదు దొరికినట్లు పుకార్లు షికార్లు చేయించారు.